క్లుప్తంగా

ఈ-పంట నమోదుపై సామాజిక తనిఖీ



ఈ-పంట నమోదుపై రైతులతో మాట్లాడుతున్న ఏఓ మాధవి

గుడిపాల: ఈ-పంట నమోదుపై సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు వ్యవసాయాధికారి మాధవి అన్నారు. ఈ-పంట నమోదు చేసుకున్న రైతులకు మంగళవారం వసంతాపురం రైతుభరోసా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతుల వివరాలను ఆమె వెల్లడించారు.. వీటిలో మార్పులు-చేర్పులు ఉన్నపక్షంలో తమకు తెలియజేయాలన్నారు. తుది జాబితాను రైతుభరోసా కేంద్రంలో ఉంచుతామన్నారు. ఈ పంట నమోదు ఆధారంగానే రైతులకు వైఎస్సార్ ఉచిత పంటలబీమా, సున్నా వడ్డీ పంట రుణాలు, వ్యవసాయ యాంత్రీకరణ, రైతు భరోసా-పీఎం కిసాన్ పథకాలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ సోనియా, రైతులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను అమలు చేయాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సోమశేఖర్‌నాయుడు

ఐరాల: రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) అమలు చేస్తామని పొందుపరచాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు కోరారు. కాణిపాకం జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఆయన మన ఓటు-మన భవిష్యత్ అనే పుస్తకాన్ని ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సురేష్‌బాబు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు భూమిపూజ



కృష్ణాపురం వద్ద భూమి పూజలో నేతలు

తవణంపల్లె: మండలంలోని చెర్లోపల్లె నుంచి కృష్ణాపురం వరకు చేపట్టనున్న రోడ్డు పనులను మంగళవారం వైఎస్సార్‌సీపీ నేతలు భూమిపూజ చేసి ప్రారంభించారు. చెర్లోపల్లె నుంచి కృష్ణాపురం వరకు, షికారీ కాలనీ నుంచి అరగొండ వరకు తారు రోడ్డుకు నాబార్డు నిధులు రూ. 4.25 కోట్లు మంజూరయ్యాయి. తారురోడ్డు పనులను మండల పార్టీ అధ్యక్షుడు హరిరెడ్డి ఆధ్వర్యంలో నేతలు పైమాఘం సుగుణాకర్ రెడ్డి, జి.ప్రకాష్ రెడ్డి, రోడ్డు పనులను ప్రారంభించారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు గాంధీబాబు, మండల సచివాలయ కన్వీనర్ శరత్‌రెడ్డి, నేతలు రవిరెడ్డి, రమణారెడ్డి, పరమేశ్వరరెడ్డి, మధుకుమార్, ప్రకాష్‌బాబు రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, జగన్నాథరెడ్డి, సుజిత్ రెడ్డి, పాలాక్షిరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి మహాకుంభాభిషేకం ఉత్సవాలు

తవణంపల్లె: ఎగువ తవణంపల్లెలోని పార్వతీదేవి సమేత నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం పుష్కర మహా కుంభాభిషేకం ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. నేడు బుధవారం నుంచి 8వ తేదీ వరకు ఉత్సవాలు, పంచలోహ ఉత్సవమూర్తి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు విశేషంగా పాల్గొని కుంభాభిషేకం ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

క్రీడాసామగ్రి వితరణ



క్రీడాసామగ్రిని అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని బాలికల గురుకుల పాఠశాలకు మంగళవారం స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రూ.15వేల విలువ చేసే క్రీడాసామగ్రిని ఉచితంగా ప్రిన్సిపల్ సునీతకు అందజేశారు. వాలీబాల్, షటిల్ కాక్స్, నెట్‌లను ఆయన వితరణ చేశారు. విద్యార్థినులు క్రీడల్లోనూ రాణించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, ముర్వత్ బాషా, కొండా మురళి, మునీశ్వర, ఆనంద, ఎస్వీ రమణ, సైపుల్లా, గోవిందరెడ్డి, కోదండ, రమేష్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొగిలికి ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు

పలమనేరు: ఈనెల ఎనిమిదిన శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని అదనపు చార్జీలు లేకుండా తమిళనాడులోని గుడియాత్తం నుంచి మొగిలికి పది, పలమనేరు నుంచి మొగిలికి నాలుగు బస్సులను ఏర్పాటు చేసినట్టు పలమనేరు ఆర్టీసీ డిపో మేనేజర్ టీకే స్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పలమనేరు నుంచి మొగిలికి రూ.20, గుడియాత్తం నుంచి మొగిలికి రూ.70 చార్జీ అని, భక్తులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

- చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి



గుడిపాల: ఎన్నికల ప్రచారంలో మహిళలతో మాట్లాడుతున్న విజయానందరెడ్డి

గుడిపాల: అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి అభ్యర్థించారు. మంగళవారం మండలంలోని చలిచీమలపల్లె, రాగిమానుపట్టెడలో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. ప్రతి కుటుంబానికి మేలు కలిగి ఉంటేనే వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని మహిళలను కోరారు. చంద్రబాబునాయుడు మాటలను ఎవరూ నమ్మడం లేదని, 2014లో రుణమాఫీ పేరిట రైతులను నట్టేట ముంచారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక అమ్మ ఒడి, పింఛన్లపెంపు, వైఎస్సార్ ఆసరా, చేయూత, చేదోడు, విద్యాదీవెన, వసతి దీవెనలతో పాటు డ్వాక్రా మహిళలకు రుణమాఫీ, వడ్డీలేని రుణాలను అందజేసిందని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ జనార్ధన్, యువత అధ్యక్షుడు శిలంబరసన్, వైఎస్సార్ సీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, మధుసూదన్‌రాయల్, రజనీకాంత్, రఘు, క్రిష్ణన్, సురేష్, రాజ్‌కుమార్, దేవా, సాంబశివ, గోవర్ధన్, కారిమేఘన్, రవి, గుండుసాయి, సాయిక్రిష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రైవేటు ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం

చిత్తూరు కార్పొరేషన్: నగర ప్రైవేటు విద్యాసంస్థల అధినేతలు, ఉపాధ్యాయులు నియోజకవర్గ అభివృద్ధిపై ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి హాజరై మాట్లాడారు. తక్కువ జీతంలో పనిచేస్తున్న ప్రైవేటు ఉపాధ్యాయుల సేవల వెలకట్టలేనివన్నారు. జగనన్న మళ్లీ సీఎం అయ్యాక ఆరోగ్యశ్రీ, సీఎంఆర్‌ఎఫ్, ఇంటి స్థలాలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు.

ప్రతిపక్షాలపై నిప్పులు

గత పాలకుల పాపాల మూలాన చిత్తూరు అభివృద్ధిలో వెనుకపడిందని విజయానందరెడ్డి పేర్కొన్నారు. న్యూట్రి ఫ్యాక్టరీ, విజయ డెయిరీలను మూసి వేయించి ఉపాధి లేకుండా చేశారని విమర్శించారు. ఒక నాయకుడు రౌడీయిజంతో పాలన సాగించి ప్రజలను పీడించారని ఆరోపించారు. ఎన్నో పార్టీలు మారినా చివరికి అతడికి ప్రజాప్రతినిధిగా అవకాశం కల్పించిన తల్లిలాంటి పార్టీకి వెన్నుపోటు పొడిచి మోసం చేశాడని దుయ్యబట్టారు. దొంగల ముఠా అంతా ప్యాకేజీ మాట్లాడుకుందని, బెంగళూరులో స్థిరపడిన ఓ ప్యారాచూట్ నాయకుడు ఎన్నికల వేళ కొత్తగా ఇక్కడ ప్రత్యక్షమయ్యాడని, ప్రజల జీవితాలను మారుస్తానని ఆయన చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇంతకాలం ఆయన ఎక్కడ ఉన్నారో ఎవరికీ తెలియదన్నారు. జగనన్న ప్రజాబలం ముందు వీరంతా చిత్తవడం తథ్యమన్నారు. స్థానికంగా అందుబాటులో ఉండే నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు. విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయులు ఎప్పుడూ పాటు పడుతుంటారని పార్టీ మహిళా నాయకురాలు గాయత్రీదేవి పేర్కొన్నారు. చిత్తూరులో వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి చిత్తూరును మరింత అభివృద్ధి చేసే అవకాశం కల్పించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి కోరారు.



ప్రైవేటు టీచర్ల ఏర్పాటు చేసిన సమావేశంలో విజయానందరెడ్డి

పీవీకేఎన్‌ను యూనివర్సిటీ చేయాలి

నగరంలో ప్రభుత్వ పీవీకేఎన్ డిగ్రీ కళాశాలను యూనివర్సిటీగా చేయాలని ప్రైవేటు ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు. పరిశ్రమల ఏర్పాటు, ప్రభుత్వ ఆస్పత్రిలో సకల వసతులు, రోడ్డు విస్తరణ, గ్రంథాలయాన్ని అప్‌గ్రేడ్ చేస్తే మంచిదని సూచించారు. ఇవన్నీ జరిగితే చిత్తూరు వేగంగా వృద్ధిలోకి వస్తుందని అభిప్రాయపడ్డారు.

కష్టపడే వారికి పార్టీలో గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

- పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్

యాదమరి: వైఎస్సార్‌సీపీ పార్టీ కోసం కష్టపడే వారిని తప్పకుండా గుర్తిస్తుందని పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక శివపార్వతీ కల్యాణ మండలంలో బూత్ కన్వీనర్లు, బూత్ ఏజెంట్లకు, గృహసారథులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సునీల్‌కుమార్ మాట్లాడుతూ దేశంలోనే ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా హామీలను నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఇంటి వద్దకే అందుతున్నాయన్నారు. గత ప్రభుత్వం చేసిన అక్రమాలకు చెక్‌పెట్టేలా ప్రజలు ఓట్లు వేసి 151 సీట్లతో జగనన్నను సీఎం చేశారని తెలిపారు. ఇంత చేస్తున్న జగనన్నకు కార్యకర్తలు, నేతలు కలిసి ప్రభుత్వం చేసిన మేలును ప్రచారం చేయాలని తెలిపారు. గ్రామ స్థాయిలోని బూత్ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు కలిసి గ్రామాల్లోని ఓటర్లకు అవగాహన కలిగించాలని తెలిపారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత జగనన్న పాలనకున్న తేడాను వివరించాలని సూచించారు. గ్రామ స్థాయిలో నిర్వహించే పార్టీ కార్యక్రమాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని సూచించారు. రాబోయే ఎన్నికలలో అందరు సమష్టిగా పని చేసి మరోసారి జగనన్నను సీఎంను చేయాలన్నారు. జెడ్పీవైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, జిల్లా కార్యదర్శి మనోహర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు రవీంద్రబాబు, హరినారాయణరెడ్డి, ముస్లిం మైనారిటీ డైరెక్టర్ కబీర్, బూత్ కన్వీనర్లు, ఏజెంట్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



హాజరైన బూత్ కన్వీనర్లు, ఏజెంట్లు

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

- హాస్టళ్లను ఆకస్మిక తనిఖీ చేసిన జడ్జి కరుణకుమార్
- విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న జడ్జి కరుణకుమార్

పుత్తూరు: మానవ అక్రమ రవాణా, కల్తీ ఆహారాన్ని నిరోధించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి ఐ.కరుణకుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, ఎస్సీ బాలుర వసతి గృహం, ఎస్సీ బాలికల వసతి గృహాన్ని జడ్జి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఆహారం, హాస్టల్ పరిసరాలు శుభ్రంగా లేదని వార్డన్ ధనంజయులురెడ్డిని మందలించారు. అనంతరం స్థానిక మెయిన్ స్కూల్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ పిల్లలకు జంక్ ఫుడ్‌ను అలవాటు చేయరాదని తెలిపారు. పిల్లల పరిరక్షణ బాధ్యత తల్లిదండ్రులపై మరింత గా ఉందన్నారు. పిల్లలు ఎప్పుడూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పరిరక్షణలో ఉండాలని సూచించారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లలను ఒంటరిగా బయటకు పంపకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదంలో ఉన్నప్పుడు 100కు ఫోన్ చేయాలని లేకుంటే, దిశా యాప్ ద్వారా పోలీసులకు సమాచా రం అందించాలని సూచించారు. కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులు లైంగిక వేధింపులకు గురైతే, లైంగిక వేధింపుల నిరోధక కమిటీకి ఫిర్యాదు చేయాలన్నారు. ఇటీవల కాలంలో పిల్లల కిడ్నాప్‌లు పెరుగుతున్నాయని, వీటి నియంత్రణలో పోలీసు లు తమ వంతు పాత్ర పోషించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలసుబ్రమణ్యం, పాఠశాల హెచ్‌ఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయులు సుబ్రమణ్యం ఆచారి, విద్యార్థులు పాల్గొన్నారు.

నందివాహనంపై కపిలేశ్వరుడి వైభవం



తిరుచ్చిపై కొలువై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీకామాక్షి అమ్మవారి సమేత శ్రీకపిలేశ్వరస్వామి

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు మంగళవారం రాత్రి సర్వాంగ సుందర అలంకారప్రియుడై శ్రీకపిలేశ్వర స్వామి అధికార నంది వాహనంపై అధిరోహించి పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు కటాక్షించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి అధికార నంది వాహనసేవ వేడుకగా సాగింది. గజరాజులు ముందు కదులుతుండా, కళాబృందాల కోలాటాలు, భజనల నడుమ స్వామివారి అధికార నంది వాహనసేవ కోలాహలంగా నిర్వహించారు. అడుగడుగునా భక్తులు స్వామి, అమ్మవారికి కర్పూర నీరాజనాలు పలికి దర్శించుకున్నారు. కాగా ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి మకర తిరుచ్చి ఉత్సవం జరిగింది. శ్రీసోమస్కంధమూర్తిగా శ్రీకామాక్షి అమ్మవారి సమేతంగా తిరుచ్చిపై కొలువై పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. భజన మండళ్ల కోలాటాలు, భజనలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి పురవీధుల్లో ఊరేగుతూ దర్శనమిచ్చారు. అనంతరం ఆలయ ఆవరణలోని మండపంలో అర్చకులు స్నపన తిరుమంజనం వేడుకగా చేపట్టారు. శ్రీసోమస్కంధమూర్తి, శ్రీకామాక్షి అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, పండ్లరసాలు, చందనంతో అభిషేకం చేశారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరోరోజు బుధవారం ఉదయం వ్యాఘ్రవాహనం, రాత్రి గజ వాహనపై స్వామివారు దర్శనమివ్వనున్నారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత, నృత్య ప్రదర్శన

శ్రీకపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం రాత్రి ఎస్వీ సంగీత, నృత్య కళాశాల, ఎస్వీ నాదస్వర, డోలు పాఠశాల వారి ఆధ్వర్యంలో ప్రదర్శించిన సంగీత, నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదిపై అధ్యాపకురాలు రవిప్రభ, సుబ్రమణ్యం వారి శిష్యబృందం ప్రదర్శించిన నాదస్వర కచేరి అలరించింది. అనంతరం కళాశాల మృదంగం అధ్యాపకులు సుధాకర్, రమేష్, శంకర్ వారి శిష్య బృందంతో ప్రదర్శించిన మృదంగ లయ విన్యాసం శ్రవణానందకరంగా సాగింది. అనంతరం కళాశాల పూర్వ విద్యార్థిని సుభాషిణి బృందం ప్రదర్శించిన నృత్యాభినయం కనువిందు చేసింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉమాముద్దుబాల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మరకాలకుప్పంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'



తవణంపల్లె: చెర్లోపల్లెలో వైద్య పరీక్షలు





బంగారుపాళెం: మాట్లాడుతున్న డాక్టర్ లోకేష్, శిబిరానికి హాజరైన రోగులు

గుడిపాల: జగనన్న ఆరోగ్య సురక్షతో గ్రామీణులకు వైద్యసేవలు మరింత చేరువ అయ్యాయని డాక్టర్లు రష్మిత, తేజేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం మరకాలకుప్పం సచివాలయం పరిధిలో సర్పంచ్ ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరం నిర్వహించారు. మొత్తం 274 మందికి వైద్యాధికారులు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు వర్కర్లు ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను సర్పంచ్ పరిశీలించారు. స్టాల్‌లోని ఆహార పదార్థాలను వైద్యం కోసం వచ్చిన వారికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ భానుప్రకాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయం

బంగారుపాళెం: పేదలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని డాక్టర్ లోకేష్ అన్నారు. నలగాంపల్లె సచివాలయం పరిధిలోని పిడివికండ్రిగ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం జగనన్న ఆరోగ్యసురక్ష-2 వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద వృద్ధులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. శిబిరంలో 235 మంది వైద్య పరీక్షలు చేసుకున్నారు. డాక్టర్లు అఖిల్, విజయకుమారి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ వైద్యం అందించడమే లక్ష్యం

తవణంపల్లె: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఒక్కరికీ వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మండల వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మంగళవారం పట్నం, చెర్లోపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలందించారు. చెర్లోపల్లెలో డాక్టర్ మోహన్‌వేలు, పట్నంలో డాక్టర్ పూజిత రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

సద్వినియోగం చేసుకోండి

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. గుండ్లపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 70 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.







ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత, గుడిపాల: రోగులకు మందులను పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది, గుడిపాల: రోగులను పరీక్షిస్తున్న డాక్టర్లు

రిజెక్ట్ ఎన్‌ఈపి సంతకాల సేకరణ

పుంగనూరు: కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తూ సేవ్ ఎడ్యుకేషన్-రిజెక్ట్ ఎన్‌ఈపి, సేవ్ ఇండియా-రిజెక్ట్ బీజేపీ నినాదంతో సంతకాల సేకరణ చేశారు. మంగళవారం పట్టణంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌ఈపితో పాఠశాలలు విలీనం చేయడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పందించేంత వరకు ఆందోళన చేస్తామన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 12 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 70,570 మంది స్వామి వారిని దర్శించుకోగా 22,490 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.20 కోట్లు సమర్పించారు.

కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం ప్యాకెట్లు

చిత్తూరు అర్బన్: చిత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) పోలీసులు నిర్వహించిన దాడుల్లో పెద్ద మొత్తంలో కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం పెనుమూరు మండలం ఉగ్రాణంపల్లె దారిలో మద్యం ఉన్నట్టు ఎస్‌ఈబీ పోలీసులకు సమాచారం అందింది. మంగళవారం చిత్తూరు ఎస్‌ఈబీ అర్బన్ సీఐ విజయకుమార్ తన సిబ్బందితో వెళ్లి తనిఖీలు చేయగా.. భూమి లోపల ఏడు సంచుల్లో పాతిపెట్టిన 2,496 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం చిత్తూరులోని స్టేషన్ వద్ద ఎస్‌ఈబీ ఏఎస్పీ సుబ్బరాజు మాట్లాడుతూ, మద్యం స్మగ్లింగ్‌లో ఉగ్రాణంపల్లెకు చెందిన కె.శివకోటికి కేసు నమోదుచేసి గాలిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే నిందితుడిని అరెస్ట్ చేస్తామన్నారు.



సుందరంగా రూపుదిద్దుకొన్న పార్వతీదేవి ఆలయం

మహాశివరాత్రికి కాళభైరేశ్వర దేవస్థానం ముస్తాబు

- నేడు ధ్వజారోహణం, అన్నాభిషేకం



ముస్తాబైన కాళభైరేశ్వర ఆలయం

తవణంపల్లె: మండల కేంద్రంలో వెలసియున్న కాళభైరేశ్వర ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 6వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు సాలికులస్థులచే ధ్వజారోహణం, స్వామికి అభిషేకం, శివలింగానికి అన్నాభిషేకం నిర్వహిస్తామని వివరించారు. సాయంత్రం ఉభయదారులతో శేషవాహన సేవను భక్తిప్రపత్తులతో నిర్వహిస్తామని తెలిపారు. 7న గురువారం ఉదయం స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహిస్తారు. రాత్రి నంది వాహన సేవ జరుగుతుందని వివరించారు. 8న శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం 6 గంటలకు అంకురార్పణ, కలశప్రతిష్ఠ, గణపతి హోమం, లక్షబిల్వార్చన సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. సాయంత్రం 3.30 గంటలకు నందీశ్వరునికి అభిషేకం, పూజలు, 4 గంటలకు మృత్యుంజయ హోమం, 5 గంటలకు లలిత సహస్రనామం, పూర్ణాహుతి హోమం, 6 గంటలకు మహారుద్రాభిషేకం నిర్వహిస్తామన్నారు. భక్తిప్రపత్తులతో 7 గంటలకు శివ మాల భక్తుల అగ్నిగుండ ప్రవేశం, రాత్రి 9 గంటలకు భైరవ వాహన సేవ పేర్కొన్నారు. 9న శనివారం ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, రాత్రి అశ్వ వాహన సేవను భక్తితో నిర్వహిస్తామన్నారు.12న మంగళవారం రాత్రి పుష్పపల్లకి సేవను నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

చిత్తూరు రూరల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని..దోమల ద్వారా వ్యాప్తి చెందే డెంగీ, మలేరియా తదితర వ్యాధులను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు ఆదేశించారు. చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఫ్రైడే డ్రైడేగా పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులపై దృష్టి పెట్టాలని చెప్పారు.

8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర కార్యదర్శి చెంగలరాయమందడి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యారంగంలో మహిళా టీచర్ల పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించడంతోపాటు మహిళా టీచర్లను సన్మానిస్తామన్నారు. అసోసియేషన్ నాయకులు, మహిళా టీచర్లు పాల్గొనాలని ఆయన కోరారు.